క్లుప్తంగా

అరటి పంటలో సమగ్ర సస్యరక్షణ చేపట్టాలి



ఈపూరు: అరటి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు, సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడి పొంద వచ్చని లాంఫామ్ ఉద్యాన పంటల శాస్త్రవేత్త ఆర్.నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని ఇనిమెళ్ల, అంగలూరు గ్రామాల్లోని అరటి తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన సమయంలో మేలు రకమైన యాజమాన్య పద్ధతులు పాటించడం అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ ఉద్యాన శాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్, వ్యవసాయ, ఉద్యాన శాఖల సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సమ్మిట్-1 పరీక్షలు

నాదెండ్ల: ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం సమ్మిట్ 1 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈనెల 10వ తేదీ వరకూ పరీక్షలు జరగనున్నాయి. తొలిరోజు ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు పరీక్ష జరిగింది. 1-5వ తరగతి వరకూ ఉదయం 10-12.30 గంటల వరకూ, 6,7,8 తరగతులకు ఉదయం 9.30- 12.45 గంటల వరకూ, 9,10 తరగతులకు మధ్యాహ్నం 1.30 - 4.45 గంటల వరకూ నిర్వహించనున్నారు. 5వ తేదీన ఇంగ్లీష్, 6వ తేదీన గణితం, 7న సోషల్ స్టడీస్, 9న జనరల్ సైన్స్, 10న సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి.ఎంఈవో ఆంజనేయులు ఆయా పాఠశాలల్లో పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు.

తేనె తయారీపై మహిళలకు శిక్షణ

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని రామలింగాపురం గ్రామంలో నాబార్డు వారి ఆర్థిక సహకారంతో నేచురల్ హెల్త్ కేర్ సొసైటీ ఆధ్వర్యంలో కొప్పుకొండ తండా, రామలింగాపురం గ్రామాల్లోని 30 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలకు తేనె తయారీపై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ సెక్రటరీ ఎస్. భగవాన్ దాస్ మాట్లాడుతూ నెలరోజుల పాటు వీరికి ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత వారికి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. అలాగే బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇప్పించి, ఆ రుణంలో ప్రతి ఒక్కరికీ 10 తేనె బాక్స్‌లు ఇప్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రీసోర్సు పర్సన్ హేమంత్, సిబ్బంది భూక్యా హంక్ నాయక్ పాల్గొన్నారు.

ఆర్థిక వివాదం.. తమ్ముడిపై అన్న దాడి

నరసరావుపేట టౌన్: ఆర్థిక లావాదేవీలా వ్యవహారంలో తమ్ముడిపై అన్న అతని కుటుంబ సభ్యులు దాడికి పాల్పడిన సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీనివాస లాడ్జీను కె.శివరామకృష్ణ నిర్వహిస్తున్నాడు. అయితే అన్నదమ్ముల మధ్య ఆర్థిక లావాదేవీల వివాదం కొన్నిరోజులుగా నడుస్తోంది. ఈ క్రమంలో శివరామకృష్ణపై అతని సోదరుడు వెంకట కోటయ్య అతని భార్య, కొడుకు, కూతురు నలుగురు కలిసి దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

యడ్లపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఎస్‌ఎస్‌ఎస్ టెక్స్‌టైల్స్ వద్ద ఢీకొనడంతో అక్కడికక్కడికే మృతి చెందాడు. శరీరంపై వాహనాలు వెళ్లడంతో పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఇతని వయస్సు సుమారు 40 ఏళ్లు ఉండవచ్చని ఆచూకీ తెలిసిన వారు యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ కలహాలు.. దాడి చేశాయి!

చిలకలూరిపేటటౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన చప్పిడి వెంకటేశ్వర్లు కొద్ది కాలం కిందట చిలకలూరిపేటలో నివాసం ఉంటూ సూదులు, పక్క పిన్నీసులు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం కొంతమంది వ్యక్తులు అతనిపై దాడి చేసి గాయపరిచారు. దాడిలో వెంకటేశ్వర్లు తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అతన్ని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

విద్యార్థుల కోసమే ఫోర్టిఫైడ్ బియ్యం

- మన ప్రభుత్వమే వీటిని అందిస్తోంది!
- మధ్యాహ్న భోజనంలో ఎన్నో పోషకాలున్నాయి
- తల్లిదండ్రులకు డీఈఓ సూచనలు
- యడ్లపాడు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



సొలస జెడ్పీహైస్కూల్ విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్న డీఈవో వెంకటప్పయ్య

యడ్లపాడు: 'ఫోర్టిఫైడ్ బియ్యంలో ఎన్నో పోషక విలువలు కలిగి ఉన్నాయి.. విద్యార్థుల భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా మనరాష్ట్ర ప్రభుత్వం మాత్రమే దీనిని తయారు చేయించి పాఠశాలలకు పంపిణీ చేస్తోంది... పిల్లలకు మంచి ఆహారం ఇది' అంటూ తల్లిదండ్రులను చైతన్య పరిచారు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటప్పయ్య. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఓబుల్ నాయుడు, యడ్లపాడు ఎంఈవో ఎ.శ్రీనివాస్‌తో కలిసి గురువారం యడ్లపాడు మండలంలోని పలు పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సొలస గ్రామంలోని ప్రైమరీ, జెడ్పీ హైస్కూల్స్‌ను సందర్శించి ఆయా పాఠశాల పరిధిలో మధ్యాహ్న భోజన పథకం అమలు, హాజరువుతున్న విద్యార్థుల వివరాలను పరిశీలించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థుల్లో సగం మంది మాత్రమే పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నట్లు గుర్తించారు.

మిగిలిన వారు క్యారేజీల్లో ఇంటి నుంచే భోజనం తీసుకు రావడంపై ఆయన మండిపడ్డారు. వెంటనే పాఠశాల ఉపాధ్యాయులతో కలసి గ్రామంలోని పలు కుటుంబాలను క్షేత్రస్థాయిలో సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులను ఎండీఎంపై చైతన్యం చేశారు. ఇకపై తాము పిల్లలకు క్యారేజీలు ఇచ్చి పంపించమంటూ డీఈవోకు పలువురు తల్లిదండ్రులు హామీ ఇచ్చారు. పథకాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని, ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈవో ఆదేశించారు.

అన్ని వసతులు అందుబాటులో ఉండాలి

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని వాటిని విద్యార్థులకు నిత్యం అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని డీఈవో ఆదేశించారు. మండలంలోని లింగారావు పాలెంలో జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన ఆయన హెచ్‌ఎం శంకర్రావుతో కలిసి సమ్మెటివ్-1 పరీక్షల నిర్వహణ, పాఠశాల వసతులను పరిశీలించారు. ఉపాధ్యాయులకు ఆయా విషయాలపై తగు సూచనలు అందజేశారు. అలాగే మైదవోలులో ప్రాథమిక పాఠశాల పరిశీలించారు. తరగతి గదికి వెళ్లి ఒకటో తరగతి విద్యార్థులచే తెలుగు, ఇంగ్లిషు పాఠాలు, మూడో తరగతి విద్యార్థులచే పరీక్షా సమ్మెటివ్ పరీక్షా పత్రాల్ని చదివించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల ప్రేరణగా ఉన్న లెసెన్స్ ప్లాన్, స్మార్ట్ టీవీ ద్వారా విద్యాబోధనపై హెచ్‌ఎం జీవీ హేమలతను అభినందించారు.

రంగోత్సవ్ పోటీల్లో మైదవోలు విద్యార్థుల సత్తా..

ఇటీవల జరిగిన రంగోత్సవ్ జాతీయస్థాయి చిత్రలేఖనం, చేతి దస్తూరి పోటీల్లో మైదవోలు ప్రైమరీ స్కూల్ విద్యార్థులు 13 మందికి బహుమతులు లభించాయి. రంగోత్సవ్ సంస్థ పంపించిన మెడల్స్, సర్టిఫికెట్లను గురువారం పాఠశాలను సందర్శించిన డీఈవో వెంకట సుబ్బయ్య విజేతలకు అందించి ఉపాధ్యాయుల కృషిని అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాజీలేదు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- జంగాలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం



ప్రజలకు సంక్షేమ పథకాలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా రాజీలేకుండా పనిచేస్తున్న ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలం జంగాలపల్లి గ్రామంలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగిప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే సంక్షేమం, అభివృద్ధిలో మారుమూల గ్రామాలు కూడా ముందంజలో ఉన్నాయన్నారు.

నూజెండ్ల మండలంలో గుండ్లకమ్మ నదిపై ఐదు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, రెండు వంతెనలుతోపాటు తలార్లపల్లి-నూజెండ్ల రింగ్‌రోడ్డులతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. అలాగే తిమ్మాపురం, కొండ్రప్రోలు, అప్పాపురం అగ్రహార భూములు సర్వే చేసి రైతులకు హక్కులు కల్పిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాలల్లో నగదు జమ చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే కాకుండా పార్టీలు, కులాలకు అతీతంగా ప్రతి పేదవారికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఇప్పట్లో లేకపోయినా ప్రజా సంక్షేమం కోసం అధికారులతో కలసి ఇంటంటికీ తిరిగి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు ఇదేం ఖర్మ, బాదుడే బాదుడు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తెలిపారు. వంటగ్యాస్, పెట్రోలు, వంటి అంశాలు కేంద్ర పరిధిలోఉన్నవని తెలిసి కూడా ప్రభుత్వం పెంచినట్లు తప్పుడు ప్రచారాలు చేస్తున్నరాని విమర్శించారు. రాష్ట్రానికి పట్టిన ఖర్మ చంద్రబాబేనని అన్నారు.

వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నియోజకవర్గంలో ఒక్కపనీ చేయలేదని తాము చేస్తున్న అభివృద్ధి పనులు అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వినుకొండ అభివృద్ధిని ఆపలేరని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ సుబ్బులు రామయ్య, మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, కంచర్లబాబు, పారా వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్లు పిచ్చిరెడ్డి, పారా వెంకటేశ్వర్లు, కొత్త కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

9న నీటి సరఫరా నిలిపివేత



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ గోవిందరావు

చిలకలూరిపేట: బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల కారణంగా ఈ నెల 9 తేదీ ఉదయం 10 గంటల నుంచి 24 గంటల పాటు పట్టణంలో మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. మంచినీటి చెరువు నుండి ఫిల్టర్ హౌస్ వరకు ఉన్న ప్రధాన పైపులైను రోడ్డు పనులకు అడ్డంకిగా ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా మరోలైన్ ఏర్పాటు చేసి దానికి ఇంటర్ కనెక్షన్ ఇచ్చే సందర్భంలో 24 గంటల పాటు నీటి సరఫరా ఉండదన్నారు. ట్యాంకర్ల ద్వారా కూడా నీటి సరఫరా ఉండదన్నారు. ఈ నేపథ్యంలో అసౌకర్యాన్ని పట్టణ ప్రజలు గుర్తించి ముందు జాగ్రత్త చర్యగా తొమ్మిదో తేదీకి ముందు అదనంగా నీటిని పట్టి నిల్వ చేసుకోవాలని సూచించారు.

అలాగే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని ఆదేశాల మేరకు రోజుకు 100 మందికి టిడ్కో గృహాలు స్వాధీనం చేస్తున్నట్లు వివరించారు. ప్రారంభోత్సవాలు జరిగిన నాటి నుంచి ఈ ప్రక్రియ కొనసాగిస్తున్నామన్నారు. అధికారుల నుంచి సమాచారం అందుకున్న టిడ్కో గృహాల లబ్ధిదారులు గృహ సముదాయంలో నివాసం ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ టి.వెంకటరమణ, కౌన్సిలర్ సుబ్బారావు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే రౌడీషీట్ తెరుస్తాం

పందెంరాయుళ్లను హెచ్చరించిన డీఎస్పీ



కోడిపందెంరాయుళ్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ

నరసరావుపేట రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ విజయ భాస్కరరావు హెచ్చరించారు. పందేపురాయళ్లకు గురువారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. నరసరావుపేట, రొంపిచర్ల మండలాల పరిధిలో గతంలో కోడిపందేలు నిర్వహించిన వారు, పందెపు కోడిపుంజులు పెంపకందార్లు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు.

ఈ సందర్భంగా డీఎస్పీ విజయ భాస్కరరావు మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహించినా, కోడి కత్తులు తయారు చేసి విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. కోడిపందెం జూదం లాంటిదని, దీని బారిన పడి అనేక కుటుంబాలు నాశనమవుతున్నాయని తెలిపారు. సంక్రాంతి పండుగను అందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటున్నామన్నారు. జూదాలు, కోడిపందేలపై సిబ్బందితో గ్రామాల్లో నిఘా పెట్టినట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్‌ఐలు బాల నాగిరెడ్డి, హజరత్తయ్య, సురేష్‌బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీ ఎంపిక



మద్దూరి కోటిరెడ్డి (తూబాడు)

నాదెండ్ల: వైఎస్సార్ సీపీ నాదెండ్ల మండల కార్యకర్తల సమావేశం మండల కేంద్రమైన నాదెండ్లలో గురువారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశం అనంతరం నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా పర్వతనేని బ్రహ్మయ్య, కోశాధికారిగా విక్రమరాజు, అధికార ప్రతినిధులు కంజుల వీరారెడ్డి, గద్దె ఆంజనేయులు, కార్యదర్శులుగా కాట్రగడ్డ రామకృష్ణ, చేరెడ్డి అంజిరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ముగ్గురిని, కార్యవర్గ సభ్యులుగా ఐదుగురిని ఎంపిక చేశారు. యువజన విభాగం అధ్యక్షుడిగా అల్లడి రవి కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పోపూరి వింధ్యారాణి, బీసీ సెల్-ఆరేటి పాపారావు, ఎస్సీ సెల్-పోపూరి సాగర్, ఎస్టీ సెల్-పొట్టూరి సుబ్బారావు, మైనార్టీ సెల్-షేక్ జానీబాషా, క్రిస్టియన్ మైనార్టీ-గాదె సిలువా రెడ్డి, వైసీపీ సేవాదళ్- రావిపూడి చెంచు రాజు, చేనేత విభాగం- వెనిగండ్ల వెంకటేశ్వర రావు, రైతు విభాగం-మంగు ఏడుకొండలు, ప్రచార విభాగం-కుదారి విజయ్, వాణిజ్య విభాగం-ఐనవోలు శ్రీరామమూర్తి, పంచాయతీ రాజ్ విభాగం- కట్టెబోయిన వీరాస్వామి, విద్యార్థి విభాగం-కొరివి అశోక్‌బాబులను ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరో 8 మందికి గాయాలు
- వనువులేరు బ్రిడ్జి వద్ద ఘటన



సంఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సు, లారీ

వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో 8 మందికి తీవ్రగాయాలైన సంఘటన మార్కాపురం రోడ్డులోని పసువులేరు బ్రిడ్జివద్ద గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... యర్రగొండపాలెం నుంచి నూజివీడు వెళుతున్న ఆర్టీసీ బస్సు నరసరావుపేట నుంచి త్రిపురాంతకం వెళుతున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీముందుగా వెళుతున్న ద్విచక్రవాహనం లారీ క్రిందపడింది. ఈ ప్రమాదంలో చింతలచెర్వు గ్రామానికి చెందిన మాల్యాద్రి (50) అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనంపై ఉన్న మరోవ్యక్తి బత్తిని పున్నారు తీవ్రంగా గాయపడ్డాడు. లారీలో ప్రయాణిస్తున్న వ్యక్తులకు గాయాలయ్యాయి.

క్షతగాత్రులను 108 వాహనం ద్వారా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ముగ్గురు రాజులు' మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

పెదకూరపాడు: పాటిబండ్ల గ్రామంలోని ముగ్గురు రాజులు దేవాలయం తిరునాళ్లకు సిద్ధమైంది. తిరునాళ్లను తిలకించేందుకు ప్రపంచంలోని నలుమూలల నుంచి అనేక మంది మత గురువులు, మత కన్యలు ఇప్పటికే ఇక్కడికి చేరుకున్నారు. ఆదర్శవంతమైన సంఘంగా, విశ్వాసానికి ప్రతీకకగా పాటిబండ్లలో నిర్మించిన ముగ్గురు రాజులు దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. హోలెండ్‌లోని మిల్‌హిల్ సభకు చెందిన మత గురువు ఫాదర్ గ్లైస్‌మాన్ 1921లో ఈ గ్రామాన్ని సందర్శించారు. ఆ క్రమంలో ఇక్కడ ముగ్గురు రాజులు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఆలయంలో శిల్పకళలు చూపరులను కట్టిపడేస్తాయి. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు 5, 6, 7 తేదీలతో ముగుస్తాయి. జనవరి ఒకటి నుంచి ప్రత్యేక దివ్యపూజ బలి నిర్వహించారు.

రోమన్ కేథలిక్‌లకు ఆధ్యాత్మిక గ్రామం

పాటిబండ్ల గ్రామం రోమన్ కేథలిక్‌ల ఆధ్యాత్మిక గ్రామంగా పేరుంది. ఈ గ్రామానికి చెందిన 48 మంది ఫాదర్లు, 130 మంది మత కన్యలు ఆంధ్రప్రదేశ్‌లోనే కాక వివిధ రాష్ట్రాలు, ఇతర దేశాల్లో నిరంతరం దేవుని సేవలందిస్తున్నారు.

పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్పష్టం చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అధ్యక్షతన మండల స్థాయిలో నూతన పింఛన్ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీపీ దంపతులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ 2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో 39 లక్షల మంది పింఛన్లు నగదు ప్రతి నెలకు రూ. 400 కోట్లు ఇవ్వగా, నేడు సీఎం వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో 64 లక్షల మంది పింఛనుదారులకు రూ.1750 కోట్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు రుణమాఫీ 83 వేల కోట్లు చేయాల్సి ఉండగా కేవలం రూ.13 వేల కోట్లు చేసి చేతులెత్తేశారన్నారు. ప్రస్తుతం ఆయన అధికారం కోసం స్వార్థ రాజకీయాలు చేయటం సిగ్గుచేటన్నారు. వాస్తవాలన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసిన ఘనత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు తన పార్టీ ఉనికి కోసం ఇరుకుగొందుల్లో సమావేశాలు నిర్వహించటం, అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలకు మోసపూరిత మాటలు అమాయక ప్రజలను జీవితాలతో ఆడుకోవటం దుర్మార్గమన్నారు. ఇటీవల జరిగిన కందుకూరు, గుంటూరు ఘటనల్లో పలువురు మృత్యువాత పడటం చాలా బాధాకరమన్నారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బురిడి బాబుకు శివశక్తి ఫౌండేషన్ ద్వారా కోట్లు దోచుకుంటున్నాడన్నారు. సమాజంలో అవ్వాతాతలకు మంచి గుర్తింపుతో ప్రతి నెలా తెల్లవారుజామునే వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛను ఇవ్వటం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో పింఛను తీసుకునే పరిస్థితి ఎవరికి ఉండకూడదనే ఉద్దేశ్యంతో పేదలందరూ మెరుగైన విద్యనభ్యసించి మంచి ఉన్నత స్థాయికి చేరుకోవాలనే ఆశయంతో సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పని చేస్తున్నారన్నారు. అనంతరం వైఎస్సార్ సామాజిక నూతన పింఛన్ పొందిన 216 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ. 2750లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాపూరి వెంకాయమ్మ, ఎంపీటీసీ సభ్యులు దేవన బోయిన పోతురాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, మండల కోఆప్షన్ సభ్యులు దూదేకుల హుస్సేన్, వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, నంబూరి ప్రభావతి, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారి ఎం.వెంకటరెడ్డి, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, మండల కోఆర్డినేటర్లు బోడెపూడి శ్రీను, బొల్లా సుబ్బారావు, సొసైటీ అధ్యక్షులు బొల్లా వెంకట సాంబశివరావు, డైరెక్టరు మద్దికుంట ఏడుకొండలు, సర్పంచులు పురేటి నాగేశ్వరరావు, మొనపాటి శ్రీనివాసరావు, చింతా పేరయ్య, యలగాల బసవయ్య, ఏపీయం జి.వాసుబాబు, మహిళలు ఉన్నారు.

నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జలజీవన్ మిషన్ మండల కోఆర్డినేటర్ బాబూరావు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో గురువారం జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారికి నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జలజీవన్ మిషన్ మండల కో-ఆర్డినేటర్ బాబూరావు మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించేందుకు కృషి చేస్తుందన్నారు.

ఈ మిషన్ ద్వారా ప్రతి గ్రామం ప్రతి మనిషికి ప్రతిరోజు 55 లీటర్ల మంచినీరు అందించాలనే లక్ష్యంతో ప్రభు త్వం కృషి చేస్తుందన్నారు. గ్రామస్తులు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సురక్షితమైన మంచినీటిని త్రాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఓలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సూట్స్‌కేర్‌తో నిప్స్ ఒప్పందం

నరసరావుపేట రూరల్: సూట్స్ కేర్ నెట్‌వర్క్‌తో నరసరావుపేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (నిప్స్) ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జే.ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సూట్స్ కేర్ నెట్‌వర్స్ ఏహెచ్‌సీ విభాగం డైరెక్టర్ వై.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ జేఎస్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో అఫడబుల్ హెల్త్‌కేర్ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు డాక్టర్ సోమశేఖరరెడ్డి తొమ్మిది సంవత్సరాల క్రితం సూట్స్ కేర్ నెట్‌వర్క్‌ను ప్రారంభించి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు.

ప్రిన్సిపల్ డాక్టర్ జేఎస్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో సూట్స్‌కేర్ నెట్‌వర్క్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిప్స్ కళాశాల జీఈడీఎస్ డైరెక్టర్ కిశోర్‌బాబు, ఫార్మా డి.ఇన్‌చార్జ్ భవ్యసాయి, సూట్స్‌కేర్ నెట్‌వర్క్ ప్రమోషన్ టీం ఇన్‌చార్జ్ కృష్ణ దేశ్‌ముఖ్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోడలిపై అత్త, మామ దాడి

నరసరావుపేట టౌన్: కోడలిపై అత్త, మామ రోకలి బండతో దాడికి పాల్పడిన సంఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాష్ నగర్‌కు చెందిన ఎస్.రమ్యపై అత్త, మామ మరియమ్మ, ఆదయ్య రోకలి బండతో దాడికి పాల్పడ్డారు. కుటుంబ వివాద నేపథ్యంలో దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

ఉరేసుకుని వివాహిత మృతి

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. క్రోసూరుకు చెందిన జొన్నలగడ్డ సురేఖ(35)ను సత్తెనపల్లి మండలం నందిగామకు చెందిన జొన్నలగడ్డ సురేష్ 14 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. కుటుంబంలో తరచూ అత్త, కోడలు మధ్య వివాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి సురేఖ ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు ఎం.కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

పింఛనోత్సాహం!



ఏడవ వార్డు సచివాలయంలో పింఛన్ పంపిణీ చేస్తున్న వార్డు నాయకుడు గేరా ధర్మారావు



ఎనిమిదవ వార్డు సచివాలయంలో పింఛన్ పంపిణీ చేస్తున్న వార్డు నాయకుడు షేక్ కరిముల్లా



నాల్గో వార్డు సచివాలయంలో పింఛన్ పంపిణీ చేస్తున్న వార్డు ఇన్‌చార్జి షేక్ జానీబాష

నరసరావుపేటలోని పలు వార్డులో గురువారం నిర్వహించిన పింఛన్ వారోత్సవాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని లబ్ధిదార్లకు పింఛన్ అందజేశారు. నాలుగు, ఏడు, ఎనిమిది వార్డుల్లోని సచివాలయాల్లో ప్రజాప్రతినిధులు పింఛన్ పంపిణీ చేశారు. నాల్గవ వార్డులో షేక్ జానీబాష, ఏడవ వార్డులో గేరా ధర్మారావు, ఎనిమిదవ వార్డులో షేక్ కరిముల్లా లబ్ధిదార్లకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు. -నరసరావుపేట

'ఆయుష్షు' పెంచేందుకు...



ములకలూరు ఎస్సీ కాలనీలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ అధ్వర్యంలో ఆయుష్ వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వైరస్ బీ-ఎఫ్ 7 తీవ్రత తక్కువే కాని, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు తప్పకుండా కోవిడ్ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య నియమాలు, తీసుకోవాల్సిన ఆహార పదార్థాల గురించి వివరించారు. అనంతరం కాలనీ వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆయుష్ మందులను అందజేశారు. కార్యక్రమంలో యోగా టీచర్స్ వెంకటాచారి, వీరయ్య, సిబ్బంది శ్రీను, గ్రామపెద్దలు పాల్గొన్నారు. - వినుకొండ (నూజెండ్ల)